క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: హంసాయనపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత శివయ్య, కొర్రకోడుకు చెందిన నేతలు నాగేంద్ర, బచ్చలయ్య(రేషన్ షాపు డీలర్) ఇటీవల మృతి చెందారు. బుధవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మృతుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంగాధర్, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, నేతలు తుప్పటి హరీష్, గంగాధర్, బచ్చలయ్య, ప్రభాకర్, వెంకటేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఉరవకొండ: పట్టణంలోని శాంతినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. కాలనీలో రెండేళ్లుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి రెండు వారాల క్రితం నూతన పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. బుధవారం పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తవడంతో అధికారులు కాలనీకి తాగునీరు సరఫరా చేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాజీ ఎమ్మెల్యే విశ్వతోపాటు ఎంపీపీ నరసింహులు, మాజీ ఎంపీపీ చందాచంద్రమ్మ, పైప్‌లైన్ నిర్మాణం జరిగేలా కష్టపడ్డ కోఆప్షన్ సభ్యులు పామిడిసలీంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ



అలంకరణలో అయ్యప్ప స్వామి

కళ్యాణదుర్గం: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం మండల పూజను ఘనంగా నిర్వహించారు. తొలుత అయ్యప్పను ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే హోమం తదితర పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ప్రమాదాల నివారణకు కృషి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు

బొమ్మనహాళ్: ప్రమాదాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలని బొమ్మనహాళ్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్ సమీపంలో ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదకర మలుపులు ఉన్న చోట సూచనలు పాటించాలన్నారు. వాహన డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించి రికార్డులు ఉండాలన్నారు. 38 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐకు సన్మానం

విడపనకల్లు: విడపనకల్లు నూతన ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న ఖాజా హుస్సేన్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, బీసీ సెల్ మండల నాయకులు కురుబ గిరిబాబు, మేకల రామాంజినేయులు, ఉలిగన్న, హనుమంతు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి



ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

వజ్రకరూరు: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం కొనకండ్ల గ్రామంలో ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటోందన్నారు. జగనన్న అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలు పెంచారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మానవతావాదని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



ఉరవకొండలో హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ మ్యాచ్



కూడేరులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కూడేరు: మండలంలో రెండో రోజు బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగాయి. కూడేరులో వాలీబాల్, కొర్రకోడులో బాట్మింటన్, కమ్మూరులో క్రికెట్, ఇప్పేరులో కబడ్డీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పీడీలు అక్కులప్ప, అంజనబాయి, రుక్మిణి, నరసింహులు, రిజ్వాన, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక ఎస్‌కె ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. వాలీబాల్, క్రికెట్ పోటీలను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలిరావడంతో క్రీడామైదానంలో సందడి నెలకొంది. మండలస్థాయి పోటీలు గురువారం ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ ఈశ్వరప్ప తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ మండల అధ్యక్షుడు, చాబాల గ్రామ వార్డు సభ్యులు ముల్లా టైలర్ లాలుసాబ్ అధ్వర్యంలో బుధవారం చాబాల గ్రామ క్రికెట్ జట్టుకు దుస్తులు, షూస్‌ను అందించారు. ఈసందర్భంగా లాలుసాబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఐహెచ్ఆర్‌సీ ఉపాధ్యక్షులు ముల్లా మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి షేక్‌హనీఫ్‌దాదాలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కరణం చిక్కప్ప పాఠశాలలో రెండో రోజు బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించామని కమిషనర్ వెంకటేశులు తెలిపారు. నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కిరణ్ పర్యవేక్షణలో క్రికెట్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు జరిగాయన్నారు. కార్యక్రమంలో రాజ్‌గోపాల్, సురేష్, శివమ్మ, రమేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్‌లో విజేతగా నిలిచిన చాబాల క్రికెట్ జట్టు

నేడు రక్తదాన శిబిరం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని ప్రభుత్వ పీహెచ్‌సీలో గురువారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతీ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం సాగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా శివ



రాయదుర్గంటౌన్: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రాయదుర్గం పట్టణానికి చెందిన కె.శివకుమార్ ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కమిటీ ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు.

అగ్రికల్చర్ ఫాం వరిగడ్డి @ రూ.3.24లక్షలు

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫాం వరిగడ్డి రూ.3.24 లక్షలు పలికింది. పీడీడీఎఫ్, ఎస్ఎస్ఎంఎఫ్ ఫారాల్లో 135 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు సంబంధించిన గడ్డిని బుధవారం స్థానిక అగ్రికల్చర్ ఫారం కార్యాలయంలో వేలం వేశారు. పోటాపోటీగా సాగిన వేలంలో మారెంపల్లి రామన్న రూ.3.24 లక్షలకు వరిగడ్డి దక్కించుకొన్నారు.

పట్టుబట్టి.. నిధులు రాబట్టి



హనుమంతప్ప కుంట వద్ద ఊటనీటిని పరిశీలిస్తున్న విప్ కాపు (ఫైల్)



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కాపు కుటుంబ సభ్యులు

- ముంపు సమస్యకు శాశ్వత చెక్
- రూ.20 కోట్ల మంజూరు
- ఫలించిన విప్ కాపు కృషి

రాయదుర్గం: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఏళ్లనాటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. చినుకుపడితే చాలు లోతట్టు ప్రాంతాలైన కొలిమి, రామస్వామి వీధులతో పాటు మధుటాకీస్ ఏరియా, లక్ష్మీబజర్‌లోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యేవి. చెరువులను తలపించేవి. ఇళ్లు, వ్యాపార సముదాయ భవనాల్లోకి వరదనీరు చొచ్చుకెళ్లి సామగ్రి తడిసిముద్దయ్యేది. ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకునే పరిస్థితి. టీడీపీ హయాంలో కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్నా సమస్యకు పరిష్కారం చూపలేదు.

హామీ ఇచ్చి.. నెరవేర్చి..

గతేడాది కురిసిన వర్షాలకు వరద బీభత్సానికి భారీ నష్టం సంభవించింది. విప్ కాపు సహాయక చర్యలు చేపట్టి ఆదుకునే ప్రయత్నం చేశారు. ముంపు సమస్యకు పరిష్కారం చూపేలా కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఈ దిశగా ఇంజనీరింగ్ నిపుణులతో నివేదికలు తయారు చేయించి ప్రభుత్వానికి సమర్పించారు. సమస్య తీవ్రతను సీఎం జగన్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే నిధులు రాబట్టారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేస్తూ రెండు రోజుల క్రితం జీఓ విడుదల చేసింది. దీంతో పట్టణ వాసులతో పాటు ముంపు బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

తాడేపల్లిలో సీఎం జగన్‌ను బుధవారం కలిసిన విప్ దంపతులు కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి, కుమారుడు కాపు ప్రవీణ్‌రెడ్డి, వియ్యంకుడు శ్రీరామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఏళ్లనాటి ముంపు సమస్యకు పరిష్కారం చూపుతూ కోరిన తక్షణమే రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పుట్టప్పతోట డ్రైనేజీ నిర్మాణం, బీటీపీ పనుల వేగవంతం, పంట నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సురెన్సు, జీన్స్ రంగ అభివృద్ధి, ఇతర సమస్యలపై చర్చించి నిధులు మంజూరుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు కాపు వెల్లడించారు. సీఎం సానుకూలంగా స్పందించినట్టు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

బెళుగుప్ప: గుండ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కుందుర్పి మండలం కెంచానపల్లి గ్రామానికి చెందిన బోయ హనుమంతు టీవీఎస్ వాహనంలో గ్రామానికి వెలుతుండగా గార్లదిన్న మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన కొర్రపాటి మహేంద్ర బొలెరో వాహనంతో ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో హనుమంతు తలకు చెవికి తీవ్రగాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన బొలెరో వాహనంలోనే కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ పేర్కొన్నారు.



తీవ్ర గాయాలపాలైన హనుమంతు

శివుడికి అన్నాభిషేకం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శివాలయాల్లో బుధవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని శంకర మఠం, జంబుకేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, చన్నవీరస్వామి, మార్కండేయస్వామి ఆలయాలతోపాటు ఇతర శివాలయాల్లో శివుడికి అన్నాభిషేకం, ఏకాదశవార రుద్రాభిషేకం, బిల్వాస్తోత్రం, మహన్యాస పారాయణం, పంచామృతాభిషేకం నిర్వహించారు. శంకరమఠంలో అర్చకులు ప్రసన్నస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి మహన్యాస పారాయణ పంచామృతాభిషేకం, అన్నంతో అభిషేకం చేపట్టారు. నగరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మంజునాథస్వామి ఆధ్వర్యంలో అన్నాభిషేకం జరిగింది. ప్రసిద్ధ జంబుకేశ్వరస్వామికి అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు, అన్నాభిషేకం గావించారు. శివాలయాలకు భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక ధనుర్మాస పూజలకు బుధవారం తెల్లవారు జామున భక్తులు హాజరై పూజలు చేశారు.



శంకరమఠంలో శివుడికి అన్నాభిషేకం

పోలింగ్ కేంద్రాల్లో సవరణ జాబితా

రాయదుర్గం రూరల్: ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేసిన జాబితాను ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు ఈఆర్‌ఓ కరుణకుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సవరణల్లో ఏవైనా తప్పులు దొర్లివుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఈడీటీ సుజాత, ఐదు మండలాల ఆర్‌ఐలు, నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

ఉరవకొండ: రాకెట్ల గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఏఓ శుభకర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట నమోదు ఆవశ్యకతను రైతులు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించాలన్న పంట నమోదు తప్పనిసరి అన్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. రాకెట్ల గ్రామంలో రైతు సుధాకర్ పొలంలో పప్పుశనగ పంటను ఏఓ పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాకెట్ల అశోక్, నాగరాజు, ఎర్రిస్వామి, రాకెట్ల ఆర్‌బీకె సిబ్బంది రామ్మూర్తి పాల్గొన్నారు.

నూతన పోస్టాఫీస్ ప్రారంభం

శెట్టూరు: మండల పరిధిలోని అనుంపల్లిలో బుధవారం నూతన తపాలా (పోస్టాఫీస్) కార్యాలయాన్ని సర్పంచ్ పాలాక్షి, ఎంపీటీసీ బీటీ ప్రకాష్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ ప్రారంభించారు. ఇప్పటి వరకు కనుకూరు గ్రామ పోస్టాఫీస్ నుంచి సేవలు అందించారు. ఇక అనుంపల్లిలోనే పోస్ట్ సేవలు ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరిగిందని అధికారులు తెలిపారు. పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ మెయిల్ ఓవర్సీర్స్ తిమ్మరాజు, పోస్టల్ సిబ్బంది తిప్పేస్వామి, బాబు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



అనుంపల్లిలో పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

గుమ్మఘట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనవరి 12 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులపై సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు రమేష్, బాలాజినాయక్ తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న గ్రామాలలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు ఇంటింటా సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి నిర్ధారణ కోసం మండల పీహెచ్‌సీకి రెఫర్ చేస్తున్నట్లు వారు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మందులతో కుష్టు నయం

కూడేరు: ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తించి మందులు వాడితే పూర్తిగా జబ్బు నయమవుతుందని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం మండల వ్యాప్తంగా ఇంటింటా కుష్టు సర్వే కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది చేపట్టారు. ఈ సర్వే జనవరి 12 వరకు ఉంటుందని వైద్యాధికారి తెలిపారు. అనుమానితుల పేర్లు నమోదు చేసుకున్నామని వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వరలక్ష్మీ, సూపర్‌వైజర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మఘట్టలో సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో గురువారం నుంచి పక్షం రోజుల పాటు ఆశావర్కర్లు కుష్టు సర్వే కార్యక్రమాన్ని సమగ్రంగా చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో కుష్టు సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశావర్కర్ల విధి, విధానాలను వివరించారు. వైద్యాధికారి ప్రియాంక, ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పీహెచ్‌ఎస్ సరోజ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణతో పచ్చపురుగు నివారణ

కూడేరు: సస్యరక్షణ చర్యలతో పప్పుశనగ పంటకు సోకే పచ్చ పురుగును నివారించవచ్చని ఏఓ విజయ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పి.నారాయణపురంలో రబీలో సాగు చేసిన పప్పు శనగ పంటను పరిశీలించారు. అక్కడక్కడ పచ్చ పురుగు పంటకు ఆశించడం, మొక్కలు ఎండిపోవడాన్ని ఆయన గుర్తించారు. పచ్చపురుగు నివారణకు ఒక ఎంఎల్ ప్రొపెనోపాస్‌ను, ఒక ఎంఎల్ 1500 పీపీఎం వేపనూనెను ఒక లీటర్ నీటిలోకి కలిపి పిచికారీ చేయాలని రైతులకు ఆయన సూచించారు. ట్రైగోడెర్మావిరిడీస్ జీవశిలీంద్రాన్ని ఎకరాకు 500 గ్రాములు పాడి ఇసుకలో కలిపి పొలం మొత్తం చల్లితే మొక్కలు ఎండడాన్ని అరికట్టవచ్చని తెలియజేశారు. వీహెచ్‌ఏ ప్రమోద్, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

విడపనకల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ కురుబ గిరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతతో భోజనం అందించాలని ఎంపీడీఓ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. రాగి మాల్ట్‌ను రుచి చూశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నాగరాజు, పంచాయితీ కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

వైభవం.. వీరభద్రస్వామి రథోత్సవం



భక్తజనం నడుమ సాగుతున్న రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో బుధవారం వీరభద్రస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకువచ్చి అందంగా అలంకరించిన రథంలో అధిష్టించి పురవీధులలో మేళతాళాలు, డప్పులతో ఘనంగా ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు, చిన్నారులు చేసిన నందికోళ్ల నృత్యం, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.

కమ్యూనిటీ హాల్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ఉరవకొండ: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా ఎంకె మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, కార్యదర్శిగా చెన్నకేశవులు, సహాయకార్యదర్శులుగా ఓబులేసు, పెద్దన్న, కోశాధికారిగా దివాకర్, ఈసీ సభ్యులుగా రమేష్‌బాబు, రామాంజనేయులు, మారుతి, వెంకటేసులు, చంద్రశేఖర్, తిప్పయ్య, రామాంజినేయులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు మల్లికార్జున మాట్లాడుతూ 1991లో అప్పటి మంత్రి లక్ష్మీదేవమ్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. అప్పటి నుంచి కమ్యూనిటీ హాల్‌లోనే వివాహది శుభకార్యాలు నిర్వహిస్తున్నామన్నారు. కొంత కాలం క్రితం బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేశారని, దీన్ని వెంటనే తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

సెమీ ఫైనల్స్‌కు నాలుగు జట్లు

గుమ్మఘట్ట: ఆర్‌వైఎస్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు సెమీ ఫైనల్స్‌కు ఎంపికైనట్లు మేనేజర్లు నగేష్, శీన తెలిపారు. విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు యువనేత కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో సిరిగెదొడ్డి, కేపీ దొడ్డి, గుమ్మఘట్ట, గుమ్మఘట్ట లయన్స్ టీంలు సెమీఫైనల్స్‌కు ఎంపిక కావడంతో మేనేజర్లు హర్షం వ్యక్తం చేశారు.

29న వాహనాల వేలం

రాయదుర్గం: రాయదుర్గం సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడ్డ 12 ద్విచక్రవాహనాలను ఈ నెల 29న సెబ్ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. ఆధార్‌కార్డుతో పాటు రూ.3 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీలోని గ్రంథాలయ సంస్థకు సంబంధించిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్ఎం మోహన్ రెడ్డి కోరారు. బుధవారం మున్సిపాల్ కమిషనర్ వెంకటేశులుకు వినతపత్రం అందజేశారు. 2016 నుంచి 2023 సంవత్సరం వరకూ బకాయిలు చెల్లించి గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

లైన్‌మెన్ మృతి



తారనాథ్

కణేకల్లు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్న తారనాథ్ (50) అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని నెలల నుంచి పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అతనికి, కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం రాత్రి కన్నుమూశారు. విషయం తెలుసుకొన్న ఉరవకొండ ఏడీ రవీచంద్ర, ఏఈఈ శంకర్‌నాయక్, యూడీసీ శ్రీనివాసులు, సిబ్బంది ఆదిగానిపల్లి గ్రామానికెళ్లి భౌతికాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అందరితో మంచిగా మెలిగి విధులు నిర్వర్తించే తారనాథ్ ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని విద్యుత్ ఆఫీసు వద్ద జనవరి 3వ తేదీన ఫర్‌ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డీఎస్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.